Pamphlets-3



# ఆదివాసులకు ఏ మాత్రం మేలు చేయని గనుల లీజును వ్యతిరేకిద్దాం

ఉన్న హక్కులు తీసేస్తామని పదే పదే బెదిరిస్తూ ఉంటే కొత్త హక్కులు అడగకుండా ఉంటారనేది పాలనాదక్షత గల వారు బాగా ఎరిగిన సత్యం.

మన ముఖ్యమంత్రి చాలా పాలనా దక్షత గలవారు.

ఆరునెలలకొకసారి మన రాష్ట్రంలో '1 ఆఫ్ 70' గురించి వాడిగా చర్చ జరుగుతూనే ఉంటుంది. ఈ చర్చ చూసి ఆదివాసులకు ఎంత ఇచ్చేస్తున్నారో అని విషయం తెలియనివాళ్లు అనుకోవాలి. '1 ఆఫ్ 70' కింద ఆదివాసులకు చాలా ఇచ్చేయబట్టే కదా ఇతరులు ఒళ్లు మండో కడుపు మండో ఆరు నెలలకొకసారి గొడవ పెట్టి ఆ చట్టాన్ని చర్చకు తెస్తున్నారు అనుకోవాలి.

నిజానికి ఆ చట్టాన్ని అమలు చేసింది కొంచెమేగానీ దానిని తీసేస్తామనీ సవరించేస్తామనీ బెదిరించింది ఎక్కువ. ఆదివాసులకు జరిగిన అన్యాయాన్ని గురించి ఎన్నడూ మాట్లాడనివాళ్లు 'పేద గిరిజనేతరుల మాట ఏమిటి?' అంటూ ఆరు నెలలకొకసారి చర్చ లేవదీస్తుంటారు.

అది అట్లా ఉండగా ఇప్పుడు ఉత్తరాంధ్ర ఏజెన్సీకి బాక్సైట్ గండమొకటి వచ్చి పడింది. నిజానికి ఈ సూచన చంద్రబాబు ఒక ఆస్ట్రేలియా కాంట్రాక్టరు చేత రాయించిన 'విజన్ 2020' అనే విధాన పత్రంలోనే ఉంది. 20 ఏళ్లలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడం కోసం తయారు చేసిన ఆ విధాన పత్రంలో రాష్ట్ర జనాభాలోని అట్టడుగు 6 శాతమైన ఆదివాసుల గురించి ఒక్క వాక్యం కూడా లేకపోగా, బాక్సైట్ తవ్వకాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగించడానికి ఆటంకంగా ఉన్న చట్టాలను సవరించాలన్న ఒక్క చల్లటి మాట మాత్రం ఉంది.

ఆ చట్టాలలో ఒకటి ఎల్.టి.ఆర్ చట్టం. దానికి '1 ఆఫ్ 70' చేసిన సవరణ ప్రకారం ఏజెన్సీలో గిరిజనేతరుల చేతిలోకి భూమి బదలాయింపు ఏ రూపంలోనూ జరగడానికి వీలు లేదు. అంటే ఖనిజం తవ్వడానికిగానీ ఫ్యాక్టరీ నెలకొల్పడానికిగానీ వారికి ప్రభుత్వం భూమి లీజుకివ్వడానికి వీలులేదు.

మరొకటి గనులు, ఖనిజాల (నియంత్రణ, అభివృద్ధి) చట్టం (ఎం.ఎం.ఆర్.డి చట్టం). ఆ చట్టంలో మన రాష్ట్రానికి మాత్రమే వర్తించే సవరణ ఒకటి ఉంది. దాని ప్రకారం ఏజెన్సీలో ఆదివాసులకు, లేదా ఆదివాసులు మాత్రమే సభ్యులుగా ఉన్న సహకార సంఘాలకు తప్ప వేరెవ్వరికీ ప్రభుత్వం గనుల్ని లీజుకివ్వడానికి వీలు లేదు.

మూడవది అటవీ (సంరక్షణ) చట్టం. దాని ప్రకారం కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా రిజర్వ్ ఫారెస్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి గనుల లీజులుగానీ ఫ్యాక్టరీ నెలకొల్పడానికి అనుమతిగానీ ఎవరికీ ఇవ్వడానికి వీలు లేదు.

ఆ అనుమతి ఇచ్చే ముందు కేంద్ర ప్రభుత్వం అనేక విషయాలను లెక్కలోకి తీసుకోవాలి. ఆ అడవి

**సాంఘికంగా చూస్తే విజ్ఞత లేని పని, చట్టపరంగా చూస్తే అధికారం లేని పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది.**

అడవి సంపద సేకరణ ఆదివాసులకు చాలా జీవనాధారం కల్పిస్తుంది. ఆకులు, కాయలు, పళ్లు, కర్ర సేకరించి జీవనం సంపాదించుకుంటారు. దానికి నష్టపరిహారం ఎట్లా ఇస్తారు? ఎవరికని ఇస్తారు? లీజుకిచ్చే భూములలో నివసించే వారేకాక దానికి వెలుపల ఉండేవారు కూడా అక్కడ జీవనాధారం పొందుతూ ఉంటారు. వారినందరినీ గుర్తించి నష్టపరిహారం ఇవ్వడం జరిగే పనేనా?

అభయారణ్యమా? జీవజాతుల నిక్షేపాలేవైనా ఆ అడవిలో ఉన్నాయా? ఏదైనా తరిగిపోతున్న జంతుజాతిగానీ వృక్షజాతిగానీ ఉందా? ఆ అడవిని గనులకు అప్పగించేస్తే సమీపంలోని ఏదైనా నదిలోకి నీటి చేరిక తగ్గిపోతుందా? రాష్ట్ర ప్రభుత్వం ఆ అడవిలో లీజు ఇయ్యాలన్న ప్రతిపాదన చేసే ముందు ఇతర ప్రత్యామ్నాయాలన్నీ ఆలోచించిందా? ఆ అడవిని గనుల కోసం ఇచ్చేస్తే, అటవీకరణ కోసం మళ్లీ అంత భూభాగాన్ని వేరే ఎక్కడయినా రాష్ట్ర ప్రభుత్వం చూపించగలదా?

కేంద్ర ప్రభుత్వం ఇవన్నీ ఆలోచించిగానీ రిజర్వ్ ఫారెస్టులో గనుల లీజుకు అనుమతి ఇవ్వకూడదు.

ఈ మూడు అవరోధాలలో మూడవ దాని గురించి మన ముఖ్యమంత్రి పెద్దగా ఆందోళన చెందుతున్నట్టు లేడు. కేంద్రంలో ఏ కూటమి అధికారంలో ఉన్నా తాను ఆ కూటమితోనే ఉంటాడు కాబట్టి కేంద్రం అనుమతి ఏదో ఒకటి చేసి తెచ్చేసుకోవచ్చుని అనుకుంటున్నాడు. 'వడ్డించేవాడు మనవాడా' అనే విషయం చూసుకుంటే చట్టం సంగతి వాడు చూసుకుంటాడని నమ్మే రాజకీయ సంస్కృతి కదా వారిది.

కానీ మొదటి రెండు అవరోధాలూ ఇట్లా తొలగిపోవు కాబట్టి ఆ చట్టాలను సవరిస్తానంటున్నాడు. రాష్ట్రంలోని గిరిజన ఎం.ఎల్.ఎలందరూ సభ్యులుగా గల ఆదివాసీ సలహా మండలి ముందు ఈ ప్రతిపాదన పెట్టాడు. 'అభివృద్ధికి అడ్డం రావద్దు జాగ్రత్త' అన్న బెదిరింపు బాగానే ప్రయోగించాడు. మొదటి దఫా చర్చ జరిగినప్పుడు 'ఇతర రాష్ట్రాలలో ఆదివాసుల ప్రాంతాలలో ఖనిజాల తవ్వకం చేపట్టిన చోట పరిస్థితి ఏ విధంగా ఉందో చూసిన తరువాత చెప్తాం' అని సలహా మండలి మే 10 నాడు తీర్మానించింది. ఆలస్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వం అదే నెల 21-23 తేదీలలో ఒరిస్సాలోని దామన్‌జోడి గనుల ప్రాంతానికి వారిని తీసుకుపోయింది. మళ్లీ 24న ఆదివాసీ సలహా మండలి సమావేశం నిర్వహించి 'ఇప్పుడు చెప్పండి' అని దబాయించింది.

ఈ తొందర చూస్తేనే ఎవరికయినా అనుమానం రావాలి. రెండు వారాల గడువులో తొలిదఫా చర్చ, అందులో సందేహాలు వ్యక్తం కావడం, ఒరిస్సా పర్యటన, మళ్లీ రెండవ దఫా సమావేశం, నిర్ణయం అన్నీ జరిగిపోయాయంటే తవ్వబోయేవి బాక్సైట్ నిక్షేపాలా లేకపోతే ఆలస్యం చేస్తే కుళ్లి పోయే టమోటాలా? చింతపల్లి ఏజెన్సీలో 'అభివృద్ధి' కోసం అంతటి ఆగలేని ఆరాటం ఉందా?

24వ తేదీన ఆదివాసీ సలహా మండలిలో జరిగిన చర్చ చూస్తే ఒకరిద్దరు మినహాయించి తక్కిన సభ్యులెవరికీ తాము చేయబోయే నిర్ణయం పర్యవసానాలు ఏవిధంగా ఉండబోతాయో అర్థం కాలేదని స్పష్టమవుతుంది. అదేదో ఈ ఒక్క అల్యూమినియం ఫ్యాక్టరీకే పరిమితమయిన నిర్ణయమయినట్టు వారు మాట్లాడారు. కానీ సలహామండలి ఆమోదం తెలిపిన చట్ట సవరణల ఫలితం చాలా దూరం పోతుంది. కనీసం 150 సంవత్సరాలుగా ఆదివాసులు చేసిన పోరాటాల ఫలితంగా వచ్చిన హక్కులు ఒక్క దెబ్బతో పక్కకు పోతాయి. గిరిజనేతర ప్రైవేట్ వ్యక్తులకూ కంపెనీలకూ షెడ్యూల్డు ప్రాంతంలో భూములు లీజుకీయవచ్చునని చట్టాన్నే సవరించిన తరువాత అది కేవలం చింతపల్లి అల్యూమినియం ఫ్యాక్టరీకే ఎందుకు పరిమితం అవుతుంది?

ఉత్తరాంధ్ర ఏజెన్సీ అంతటా బాక్సైట్ నిక్షేపాలున్నాయి. చింతపల్లి దగ్గర మాత్రమే కాదు. బాక్సైట్ ఖనిజమే కాదు, రంగురాళ్ల నిక్షేపాలూ ఉన్నాయి. '1 ఆఫ్ 70' కారణంగానే ఆ రంగు రాళ్ల తవ్వకాన్ని గిరిజనేతర వ్యక్తులకు లీజుకు ఇవ్వకుండా ఆదివాసీ యువకుల సహకార సంఘాలకే ఇవ్వాలని ప్రభుత్వం ఈ మధ్యనే జివొ జారీ చేసింది. చింతపల్లి అల్యూమినియం ఫ్యాక్టరీ విషయంలో ఉన్న ఆరాటం ఆ జివొ అమలు విషయంలో లేదు కాబట్టి దాని అమలు ప్రస్తుతం నత్త నడక నడుస్తున్నది. రేపు చట్టసవరణ చేసేస్తే ఆ జివొను వెనక్కి తీసుకుని రంగు రాళ్ల లీజు కూడా గిరిజనేతరులకు ఇవ్వరని నమ్మకమేముంది?

మేము దానికి ఒప్పుకోము అని ఆదివాసీ సలహా మండలి సభ్యులు అంటారేమో. మిమ్మల్ని ఎవరు అడుగుతారు? చట్ట సవరణకు మీ ఆమోదం తీసుకుంటారుగానీ ప్రతీ లీజుకూ తీసుకోరుగదా!

కాబట్టి, ఈ ఆమోదం కేవలం చింతపల్లి అల్యూమినియం ఫ్యాక్టరీకే పరిమితం కావాలిగానీ 'ఏజెన్సీలోకి పరిశ్రమల వరద రావడానికి వీలులేదు' అంటూ ఆదివాసీ సలహా మండలి మే 24 నాటి ఆమోదానికి పెట్టిన 'షరతు' వారికి ఆత్మ సంతృప్తినివ్వడానికి తప్ప ఇంకెందుకూ పనికిరాదు.

**అడవి పైన ఆస్తి హక్కు లేకుండా జీవనాధారం పొందే వారికి ఏ రకమైన నష్ట పరిహారం ఇస్తారు?**

నిర్వాసితులయిన ఆదివాసులకు నష్ట పరిహారం ఇవ్వాలనీ ఇళ్లు కట్టియ్యాలనీ ఫ్యాక్టరీలో ఉద్యోగాలు అత్యధికంగా వారికే ఇవ్వాలనీ ఫ్యాక్టరీ లాభాలలో కొంత భాగం పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం వెచ్చించాలనీ కాఫీ తోటలు తొలిగించినట్టయితే వాటిలో పని చేస్తున్న వారికి వేరే పనులు కల్పించాలనీ ఇత్యాది 'షరతులు' కూడా ఆదివాసీ సలహా మండలి పెట్టింది.

నష్ట పరిహారం ఎవరికిస్తారు? దేనికిస్తారు? గనులు, ఫ్యాక్టరీ నెలకొల్పబోయే భూమిలో పట్టా హక్కు లెవరికైనా ఉంటే వారికి ఆ మేరకు ఇస్తారు. దానికి ఆదివాసీ సలహా మండలి షరతు అవసరం లేదు. నూరేళ్లుగా అమలులో ఉన్న భూమి సేకరణ చట్టం ఉండనే ఉంది. కానీ అడవి పైన ఆస్తి హక్కు లేకుండా జీవనాధారం పొందే వారు అనేకులుంటారు. వారికి ఏ రకమైన నష్ట పరిహారం ఇస్తారు? చింతపల్లి ఏజెన్సీలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో పట్టా లేకుండా పోడు వ్యవసాయం చేసే కోందు (సామంత) కుటుంబాలు చాలా ఉన్నాయి. వాళ్లకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని ఆదివాసీ సలహా మండలి తీర్మానం చేసినంత మాత్రాన వాళ్లకిప్పుడిచ్చేస్తే రేపు రిజర్వ్ ఫారెస్ట్‌లో చట్టవిరుద్ధంగా వ్యవసాయం చేసే వారందరూ మానుకొమ్మంటే నష్టపరిహారం అడుగుతారు కాబట్టి వీలుకాదని ప్రభుత్వం అనదా? నిర్వాసితులకు ఇదిస్తామనీ అదిస్తామనీ మొదట్లో ఒప్పందాలు చేసుకొని వారిని తొలగించేసి ఆ తరువాత ఆ ఒప్పందం చెల్లదనీ చట్టవిరుద్ధమనీ కోర్టు తీర్పుకు విరుద్ధమనీ లేకపోతే ఫైనాన్స్ శాఖ అభ్యంతరం తెలిపిందనీ చెప్పి ఆపేసిన ఉదంతాలు ఎన్ని లేవు? కొత్తగా ఎం.ఎల్.ఏలయిన ఆదివాసీ శాసనసభ్యులకు తెలియకపోవచ్చునుగానీ పాతవారికి తెలియవా?

పోడు వ్యవసాయమొక్కటే కాదు. అడవి సంపద సేకరణ ఆదివాసులకు చాలా జీవనాధారం కల్పిస్తుంది. ఆకులు, కాయలు, పళ్లు, కర్ర సేకరించి జీవనం సంపాదించుకుంటారు. దానికి నష్టపరిహారం ఎట్లా ఇస్తారు? ఎవరికని ఇస్తారు? లీజుకిచ్చే భూములలో నివసించే వారేకాక దానికి వెలుపల ఉండేవారు కూడా అక్కడ జీవనాధారం పొందుతూ ఉంటారు. వారినందరినీ గుర్తించి నష్టపరిహారం ఇవ్వడం జరిగే పనేనా?

ఉద్యోగాలు అత్యధికంగా ఆదివాసులకే ఇవ్వాలని కూడా సలహా మండలి షరతు పెట్టింది. కానీ అక్కడ గనులు లీజుకు ఇవ్వబోయేది ప్రైవేట్ కంపెనీలకు. ఫ్యాక్టరీ కట్టబోయేది ఏదో ఒక ప్రైవేటు కంపెనీ. ప్రైవేట్ రంగంలో ఇప్పటిదాకా ఏ రకమైనా రిజర్వేషన్లూ లేవు. అత్యధిక ఉద్యోగాలు కాదు, ప్రభుత్వ రంగంలో ఉండే 6 శాతం రిజర్వేషన్ కూడా ఆదివాసులకు ప్రైవేట్ రంగంలో లేదు.

అటువంటప్పుడు సలహా మండలి షరతు అమలు కావాలంటే లీజులోనే ప్రభుత్వం ఈ నియమాన్ని రాయవలసి ఉంటుంది. అప్పుడు లీజు తీసుకోవడానికి ఏ కంపెనీ ముందుకు రాకపోతే ఏమవుతుంది? బాక్సైట్ ఖనిజాన్ని 'వృధా' పోనివ్వకూడదన్న ఆరాటం కదా ఈ గొడవకు మూలం. మరి అప్పుడు ప్రభుత్వం ఆ నియమాన్ని వదులుకోదా? వదులుకోకుండా ఆదివాసీ సలహా మండలి అడ్డుపడుతుందా? లేదా లోపాయకారీగా ప్రభుత్వమూ, ఆ కంపెనీ కూడబలుక్కొని 'అర్హత గల ఆదివాసులను తీసుకుంటాం' అని లీజులో రాస్తారు. ఆ తరువాత మీకెవ్వరికీ అర్హత లేదు పొమ్మంటారు. మూటలు మోసే క్యాజువల్ కార్మికులుగా మాత్రం పనికొస్తారంటారు. ఇది ఎన్ని చోట్ల జరగలేదు?

తాము ఆదివాసులతో మాట్లాడామనీ వారంతా అల్యూమినియం ఫ్యాక్టరీ, గనులు ఏజెన్సీలో రావాలని కోరుకుంటున్నారనీ ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారనీ సలహా మండలి సభ్యులు అన్నారు. ఎవరెవరితో మాట్లాడారు, ఎంత మందితో మాట్లాడారు అన్న చర్చలోకి పోకుండా ఈ అభిప్రాయం ఆదివాసులలో ఉండడం కూడా సహజమేనని ఒప్పుకోవచ్చు. విశాఖపట్నం వీధులలో కనిపించే అభివృద్ధి తమకు కూడా కావాలని చింతపల్లి ఆదివాసులు కోరుకోవడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. వారు శాశ్వతంగా పోడు కొట్టుకుంటూ కుంకుడు కాయలు ఏరుకొని జిసిసికి అమ్ముకుంటూ బతకాలనే కోరుకుంటారని అనుకోవలసిన అవసరం లేదు.

కానీ ఈ ఆశకూ రేపు జరగబోయే దానికీ పోలికేమీ లేదని తెలిసి కూడా అది తెలియని వారి ఆశను అడ్డం పెట్టుకొని నిర్ణయాలు తీసేసుకునే కౌటిల్యాన్ని ఏమనాలి? జార్ఖండ్ ప్రాంత పారిశ్రామిక నగరాలు - రౌర్కేలా నుండి టాటానగర్ దాకా- ఉత్తరాంధ్ర వాసులకు సుపరిచితమే. అక్కడ తమ భూములనూ తమ అడవినీ గనులకూ ఫ్యాక్టరీలకూ కోల్పోయిన ఆదివాసులు ఎంత సుందరమైన అభివృద్ధిని పొందారు? అతి కొద్ది మంది అభివృద్ధిలో భాగమయ్యారుగానీ అంతకంటే చాలా ఎక్కువ మంది నేర ప్రపంచం లోకి నెట్టబడ్డారు. కిరాయి హంతకులు, వ్యభిచారులు, దొంగలు, మాఫియాల అనుయాయులు అయ్యారు. మెజారిటీ అర్ధ నిరుద్యోగపు అభద్రతలో బతుకులు ఈడుస్తున్నారు. ఈ సంగతి తెలియని పెదబయలు వాసులూ కొయ్యూరు వాసులూ గనుల కోసం, ఫ్యాక్టరీ కోసం ఆశగానే

ఎదురు చూడవచ్చునుగాక. అయితేనేం? వాళ్ల అమాయకత్వాన్ని 'ప్రజల కోరిక'గా భావించి చాలా తీవ్రపరిణామాలు ఉండగల మార్పులు ఆహ్వానిద్దామా?

ఇక విజ్ఞత సంగతి అటుంచి, ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న చట్ట సవరణలు చేపట్టే శాసన సంబంధమైన అధికారం రాష్ట్ర అసెంబ్లీకి ఉందా? అంటే లేదనే చెప్పాలి. ఎల్.టి .ఆర్ చట్టంలోని సెక్షన్ 3(1) (ఎ)ను సవరించాలనీ గనులు, ఖనిజాల (నియంత్రణ, అభివృద్ధి) చట్టం (ఎంఎంఆర్‌డియాక్ట్)లోని సెక్షన్ 11(5)ను తొలగించాలనీ ప్రభుత్వం ప్రతిపాదన. గిరిజనేతర వ్యక్తులు, లేక కంపెనీలకు ఏజెన్సీలో భూములు లీజుకివ్వడానికి ఇవే ఆటంకమనీ వీటిని రాష్ట్ర అసెంబ్లీ సవరించేస్తే సరిపోతుందనీ చంద్రబాబు అనుకుంటున్నాడు.

అది భ్రమ. ఏజెన్సీలో గిరిజనేతరులకు భూములు ప్రభుత్వం ఏ రూపంలోనూ బదలాయించడానికి వీలులేదన్న నిషేధం రాజ్యాంగంలోనే ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు పేరాగ్రాఫ్ 5(2) (ఎ)(బి)లలోనే ఈ నిషేధం ఉందని జస్టిస్ రామస్వామి సమతా వర్సస్ స్టేట్ (1997) కేసులో అన్నారు. సుప్రీంకోర్టు అభిప్రాయం చంద్రబాబుకు నచ్చకపోవచ్చు. నచ్చాలన్న నియమం ఏమీలేదు. కానీ రాజ్యాంగానికి తుది వ్యాఖ్యానం ఇచ్చే అధికారం సుప్రీంకోర్టుకు మాత్రమే ఉంది, చంద్రబాబుకు లేదు.

కాబట్టి తన కోరికకు ఆటంకమని మన ముఖ్యమంత్రి భావిస్తున్న చట్టపరమైన నియమాలు తొలగిపోవాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. రాష్ట్ర అసెంబ్లీలు రాజ్యాంగ సవరణ చేయలేవు. నిజానికి అయిదవ షెడ్యూలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగం కాబట్టి ఈ రాజ్యాంగ సవరణ పార్లమెంట్‌కు కూడా సాధ్యం కాకపోవచ్చు. సారాంశంలో, ప్రస్తుత రాజ్యాంగం ఉన్నంత కాలం ఏజెన్సీలో గిరిజనేతరులకు ప్రభుత్వం భూములను బదలాయించడానికి వీలు లేదు.

**సాంఘికంగా చూస్తే విజ్ఞత లేని పని, చట్టపరంగా చూస్తే అధికారం లేని పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది.**

వద్దంటే, మరి రాష్ట్రంలోని బాక్సైట్ నిక్షేపాలు వృధాగా నేలలో ఉండిపోవలసిందేనా? అని ప్రభుత్వం దబాయిస్తుంది. దేశంలోని అతిపెద్ద బాక్సైట్ నిక్షేపాలు ఉత్తరాంధ్ర ఏజెన్సీలో ఉన్నాయి. దానిని తవ్వితీసి పారిశ్రామిక ముడి లోహమైన అల్యూమినియం తయారు చేయడం చంద్రబాబు కోరుకునే 10 శాతం అభివృద్ధి రేటుకు సూటిబాట అని అతని అభిప్రాయం.

అభివృద్ధి ప్రజల కోసమైతే, ఉత్తరాంధ్ర ఏజెన్సీలోని ఖనిజాన్ని పూర్తి స్థాయిలో వెలికితీసే ఆలోచనను కట్టి పెట్టవలసిందే. అది ఆదివాసుల జీవితాన్ని ధ్వంసం చేస్తుంది. పరిమితమైన పరిమాణంలో వెలికి తీయవచ్చు. అది కూడా ఆదివాసీ సహకార సంఘాల ద్వారా జరగడమే ఆదివాసులకూ మంచిది, రాజ్యాంగబద్ధమూ అవుతుంది.

వాళ్ల దగ్గర అంత పెట్టుబడి ఎక్కడిది? అని అడుగుతున్నారు. పెట్టుబడిదారీ కంపెనీలయితే మాత్రం నూరు శాతం పెట్టుబడి తామే పెట్టుకుంటున్నాయా? అయిదు శాతం లేక పది శాతం తాము పెట్టుకొని తక్కినది బ్యాంకుల నుండి లేక ఇతర ద్రవ్య సంస్థల నుండి అప్పుతెచ్చుకుంటున్నాయి. ఆదివాసీ సహకార సంఘాలకు ఆ అయిదు లేక పది శాతం ప్రభుత్వం అప్పు పెట్టవచ్చు. తక్కిన పెట్టుబడికి తానే సెక్యూరిటీ ఇచ్చి బ్యాంకుల నుండి ఇప్పించవచ్చు.

ఇందులో అసాధ్యమేమీ లేదు, సంకల్పముండాలంతే. ఆ సంకల్పాన్ని రాజ్యాంగం ప్రభుత్వాల ఇష్టాయిష్టాలకు వదిలేయకుండా రాజ్యాంగంలోనే రాసి పెట్టింది. ఆదివాసుల శ్రేయస్సు కోసం - ఆర్థిక అభివృద్ధి కోసం, విద్యాపరమైన అభివృద్ధి కోసం, ఉద్యోగ అవకాశాల కోసం - ప్రత్యేకంగా దృష్టి పెట్టి కృషి చేయాలని భారత రాజ్యాంగం ఆర్టికల్స్ 15(4), 16(4), 16(4ఎ), 46, 243-డి, 243-టి, 244, 335లలో ఆదేశించింది. ఆదివాసులకు మేలు చేయడానికి ఏ చట్టాన్నయినా పక్కన పెట్టే ఆదేశాలు జారీ చేయవచ్చునని రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు అంటుంది.

ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చేది ఈ రాజ్యాంగ ఆదేశాలు అమలు చేయడానికి. వీటిని తప్పించుకునే దొడ్డిదారులు వెతికి ఆదివాసులను లెక్కపెట్టని 'అభివృద్ధి'ని సాధించడానికి కాదు.

హైద్రాబాద్ — మానవహక్కుల వేదిక (HRF)

**18-07-2000**